హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- ఆ పార్టీ పాలనపై ప్రజలు విసుగు చెందారు..
- సర్కార్ తీరును ఎండగట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలి
- బీఆర్ఎస్ పార్టీ మండల నూతన అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, కార్యనిర్వాహక నూతన అధ్యక్షుడు పడిగళ్ల అశోక్

బీఆర్ఎస్ పార్టీ మండల నూతన అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, కార్యనిర్వాహక నూతన అధ్యక్షుడు పడిగళ్ల అశోక్‌ను సన్మానిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, ఫిబ్రవరి 11 : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ మండల నూతన అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, కార్యనిర్వాహక నూతన అధ్యక్షుడు పడిగళ్ల అశోక్ అన్నారు. 14 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసుగు చెందారని, మళ్లీ అధికారంలోకి కేసీఆర్, కేటీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్ నాయకులు, కార్యకర్తలతో అంతర్గత సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత, బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిపై సమావేశంలో చర్చించారు. హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలంపై గ్రామాల్లో, రచ్చబండ వద్ద, పొలాల వద్ద, చెట్ల కింద, ప్రజలు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో చర్చ పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా మహిపాల్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పడిగళ్ల అశోక్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు ఎన్నుకున్నారు. అనంతరం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైనా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చి ప్రజలు, మహిళలు, రైతులను నిలువునా మోసం చేసిందన్నారు.

మోసం చేసిన కాంగ్రెస్

సాధ్యం కాని ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ప్రజలు మండిపడుతున్నారని మహిపాల్‌రెడ్డి, అశోక్ అన్నారు. తక్కువ కాలంలోనే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకతను మూట గట్టుకున్నదన్నారు. రూ.2లక్షల రుణ మాఫీ, రైతు భరోసా, కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం, మహిళలకు రూ.2500, వృద్ధులకు రూ.4వేల పింఛన్ తదితర వాటిని అమలు చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధి జరిగిందని.. కాంగ్రెస్ హయాంలో ఏ ఒక్క ఊరు, పట్టణం అభివృద్ధి చెందిన దాఖలాలు లేవన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తదిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ చేతగాని తనాన్ని, బీఆర్ఎస్ అభివృద్ధిపై గ్రామాలు, ప్రధాన కూడళ్లు, హోటళ్లలో చర్చబెట్టాలని సూచించారు. ప్రజలకు, పార్టీ నాయకులకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పార్టీ చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతం చేస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రకళ కమాల్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, మైనార్టీ మండల అధ్యక్షుడు గయాజ్, మండల సమన్వయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీ-ఫైబర్ సేవలను వినియోగించుకోవాలి

హాజిపల్లిలో వరల్డ్ బ్యాంక్ బృందం

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 11 : టీ-ఫైబర్ ఇంటర్‌నెట్ సేవలను వినియోగించుకోవాలని వరల్డ్ బ్యాంక్ టీమ్ సభ్యులు సూచించారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లిలో వారు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న టీ-ఫైబర్ హైస్పీడ్ బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణులకు టెలీమెడిసిన్, విద్యావకాశాలు, ఆరోగ్యం తదితర వాటిని మెరుగు పరిచేందుకు ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ పథకం కింద 100 ఎంబీపీఎస్ స్పీడ్‌లో ఇంటర్నెట్ వస్తుందన్నారు. ఇంటర్నెట్ ఉంటే.. ప్రపంచం మన చేతిలో ఉన్నట్లే అన్నారు. ఎక్కడ ఏమి జరిగినా ఇంటర్నెట్ ఉంటే క్షణాల్లో వార్తలు తెలుసుకోవచ్చన్నారు. గ్రామంలో ఫైబర్ ఇంటర్నెట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వరల్డ్ బ్యాంక్ టీమ్ సభ్యులు కిమ్‌బెర్లీ జాన్స్, సాంజ్, ఇస్రామెహత, అర్జున్ శర్మ, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్, మండల పరిషత్ అధికారి బన్సీలాల్, మండల పంచాయతీ అధికారి జయంత్‌రెడ్డి, గ్రామ ప్రత్యేక అధికారి కరుణశ్రీ, పంచాయతీ కార్యదర్శి హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచాలి

నోములలో ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత

మంచాల, ఫిబ్రవరి 11 : నర్సరీల్లో రైతులకు అవసరమైన మొక్కలను ఇచ్చేందుకు సిద్ధంగా ఉంచాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నోముల గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పథకం ద్వారా నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి రోజు నర్సరీ పనుల్లో భాగంగా క్రమం తప్పకుండా మొక్కలకు ఉదయం, సాయంత్రం నీరందించాలని సూచించారు. వర్షాకాలంలోపు మొక్కలు నాటే సమయానికి గ్రామాల్లో సరిపడా మొక్కలను అందుబాటులో ఉంచాలని చెప్పారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన పశువుల షెడ్‌ను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో వీరాంజనేయులు, ఈసీ విమల, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ సక్కుబాయి, టీఏ మహేశ్, రుక్మిణి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు

వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 11 : హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు విధించారని ఎస్పీ నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2014 డిసెంబర్ 27న మర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్యా నేరంలో నిందితులకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికీ రూ.వేయి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని తెలిపారు. జరిమానా చెల్లించని వారికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తున్నట్లు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి సున్నం శ్రీనివాస్ రెడ్డి మంగళవారం తీర్పు ఇచ్చారని తెలిపారు. మర్పలి మండల పరిధిలోని ఘనాపూర్ గ్రామానికి చెందిన పట్లోళ్ల సంగమ్మ కూలీ పనులు చేసుకుంటూ ఇస్నాపూర్‌లో నివాసం ఉంటుంది. 2014 డిసెంబర్ 27న ఆమె బావ పట్లోళ్ల మల్‌శెట్టి మృతి చెందారు. అంత్రక్రియల నిమిత్తం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి ఘనాపూర్‌కు వచ్చింది. అనంతరం రాత్రి ఇంటి ముందు కుటుంబ సభ్యులతో కలిసి మంట కాపుకుంటున్నది. ఆ సమయంలో గ్రామస్తులు పట్లోళ్ల శ్రీను, మల్లేశం, సలీం, శివయ్య, పటేల్ అక్కడికి వచ్చి గతేడాది పటేల్‌ను హత్య చేసిన ఘటనపై ఫిర్యాదు చేసినందుకు ఆమె చిన్న కుమారుడు పట్లోళ్ల సురేశ్ (28)పై కత్తులు, రాళ్లతో దాడి చేసి హత్య చేశారని ఫిర్యాదు చేసింది. అప్పటి మర్పల్లి ఎస్సై అరుణ్ కుమార్ కేసు నమోదు చేశారు. అప్పటి మోమిన్‌పేట సీఐ రంగ కేసును దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ సమర్పించారు. వాదోపవాదనలు విన్న తర్వాత పట్లోళ్ల శ్రీనివాస్, మల్లేశం, సలీం, శివయ్య పటేల్‌కు జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. నేరస్తులకు శిక్ష పడేలా చేసిన పీపీలు సుధాకర్ రెడ్డి, వి.రవి కుమార్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, మొదటి ఐవోలు అప్పటి మర్పల్లి ఎస్సై అరుణ్ కుమార్, రెండో ఐవో అప్పటి మోమిన్‌పేట సీఐ రంగ, ప్రస్తుత ఎస్సై సురేశ్, ప్రస్తుత సీఐ నవీన్‌కుమార్, అదనపు సీడీవోలు జి.శ్రీశైలం, బ్రీఫింగ్ ఆఫీసర్లు బి.వీరన్నను ఎస్పీ అభినందించారు.

సీఎం పక్షపాత ధోరణి మానుకోవాలి

కులకచర్ల ఎంఈవో కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం సమర్పిస్తున్న పీఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్

కులకచర్ల, ఫిబ్రవరి 11 : మన ఊరు-మన బడిలో చేసిన పనులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు కొడంగల్ నియోజకవర్గానికి చెల్లించి పక్కన ఉన్న పరిగి నియోజకవర్గానికి చెల్లించకుండా ఆపడం తగదని, ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్‌రెడ్డి పక్షపాత ధోరణి మానుకోవాలని పీఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం కులకచర్ల మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం ఎదుట పాత బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సొంత నియోజకవర్గంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించి ఇతర నియోజకవర్గాల్లోని పాఠశాలల్లో పని చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడం తగదన్నారు. రాష్ట్రంలో ప్రతి పాఠశాల సొంత పరిధిలోకి వస్తుందని దీన్ని మరిచి సొంత నియోజకవర్గానికి నిధులు ఇచ్చి పరిగి నియోజకవర్గంలో పని చేసినా నిధులు ఇవ్వక పోవడం దారుణమన్నారు. రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గానికి సీఎం కాదని తెలంగాణకు సీఎం అని భావిస్తున్నామన్నారు. రెండేండ్ల నుంచి పని చేసినందుకు బిల్లులు రాకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నామన్నారు. అప్పులు చేసి వడ్డీలు చెల్లించలేక పోతున్నామని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పాఠశాలలకు తాళాలు వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కులకచర్ల ఎస్ఎంసీ మాజీ చైర్మన్ రవిచంద్ర, ముజాహిద్‌పూర్ అరవింద్, మల్లేపల్లి వెంకటయ్య, బొంరెడ్డిపల్లి చంద్రయ్య, వెంకటయ్య, సాల్వీడ్ మహిపాల్, చాకలిపల్లి సుధాకర్, కొత్తపల్లి వెంకటయ్య, దాస్యనాయక్ తండా రాజు, చెల్లాపూర్ వెంకటేశ్, ముజాహిద్‌పూర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్

వికారాబాద్, ఫిబ్రవరి 11 : వచ్చే వేసవిలో అడవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా అధికారులు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్ తెలిపారు. మంగళవారం జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో జిల్లా స్థాయి నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీలో పెరుగుతున్న మొక్కలకు తగినంత నీరు అందేలా చర్యలు తీసుకుంటూ.. వాటిని రక్షించాలన్నారు. వర్షాకాలంలో నాటేందుకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 2025-26వ సంవత్సరంలో చేయాల్సిన ప్లాంటేషన్ పనులపై చర్చించారు. సమావేశంలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేయరు.. చెత్త తీయరు..

నెల రోజులుగా ఒకే దగ్గర ఉన్న గ్రామపంచాయతీ ట్రాక్టర్

- నెల రోజులుగా చెత్త సేకరణ బంద్
- ట్రాక్టర్ పాడవడంతో చేయించని అధికారులు
- మున్సిపాలిటీలో విలీనమైనా చెత్త సేకరణ జరగని వైనం

పరిగి, ఫిబ్రవరి 11 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో సీజనల్ వ్యాధులు తగ్గాయన్నది వాస్తవం. కాంగ్రెస్ సర్కార్ వచ్చిన తర్వాత గ్రామాలను పట్టించుకోకపోవడంతో మళ్లీ కథ మొదటికి వచ్చింది. పరిగి మండలంలోని రుక్కుంపల్లి గ్రామం పరిగి మున్సిపాలిటీలో విలీనమవుతున్నదని రెండు నెలల నుంచి ప్రక్రియ ప్రారంభమైంది. జనవరి నెలాఖరులో మున్సిపాలిటీలో విలీనమైంది. గ్రామంలో చెత్త సేకరణకు ఉపయోగించే ట్రాక్టర్ చెడిపోవడంతో మరమ్మతు చేయించడంలో అధికారులు మీన మేషాలు లెక్కించారు. ఇప్పటికే పెండింగ్ బిల్లులు రాకపోవడంతో మాజీ సర్పంచ్‌లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల పెండింగ్ బిల్లులు ఎలా చెల్లిస్తారనేది ఇప్పటికీ స్పష్టత లేదు. మరోవైపు చెడిపోయిన ట్రాక్టర్‌ను మరమ్మతు చేయించేందుకు గ్రామ కార్యదర్శి సైతం చొరవ చూపించలేదని సమాచారం. జేబులో నుంచి డబ్బులు ఖర్చు చేసి మరమ్మతు చేయిస్తే బిల్లులు వస్తాయో రావోననే సంశయంతో అలాగే వదిలేశారు. రుక్కుంపల్లిలో నెల రోజులుగా చెత్త సేకరణ జరగడం లేదు. అంతకు ముందు ఇంటింటి నుంచి చెత్త సేకరించి డంపింగ్ యార్డులో వేసేవారు. ట్రాక్టర్ మరమ్మతు చేయకపోవడంతో ఇళ్ల నుంచి చెత్త సేకరణ నిలిచిపోయిందని గ్రామస్తులు పేర్కొన్నారు. రుక్కుంపల్లి గ్రామం మున్సిపాలిటీలో విలీనమై సుమారు 15 రోజులు కావస్తున్నా ఇప్పటివరకు చెత్త సేకరణపై మున్సిపాలిటీ సైతం దృష్టి పెట్టకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. తమ గ్రామంలో చెత్త సేకరణ చేయరా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సౌకర్యాలు లేని దవాఖానలపై చర్యలు తీసుకోవాలి

డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

వికారాబాద్, ఫిబ్రవరి 11 : కనీస సౌకర్యాలు లేని మల్టీ స్పెషాలిటీ పేరుతో కొనసాగుతున్న వికారాబాద్ మెడిక్యూర్, పరిగి సాధన దవాఖానలపై చర్యలు తీసుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు మంగళవారం వికారాబాద్ డీఎంహెచ్‌వోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్, మల్లేశ్ మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలో కనీస సౌకర్యాలు లేకుండా మల్టీ స్పెషాలిటీ పేరుతో ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. అత్యవసరం పరిస్థితిలో హాస్పిటల్స్ ఎదుట వాహనాలు నిలపడానికి పార్కింగ్ సౌకర్యం లేకుండానే అనుమతులు పొందుతున్నారని మండిపడ్డారు. ఒక ల్యాబ్‌లో నిర్వహించిన పరీక్ష రిపోర్టులు మరో హాస్పిటల్‌లో చెల్లవని, మళ్లీ వారి వద్ద టెస్టులు చేయించుకోవాలని, అడిగినంత ఫీజు ఇవ్వాలని, మందులు కూడా అక్కడే కొనాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. హాస్పిటల్ పర్మిషన్ ఒక డాక్టర్ పేరు మీద ఉంటే మరో డాక్టర్ వచ్చి ట్రీట్‌మెంట్ చేస్తున్నారని తెలిపారు. అవసరం ఉన్నా లేకపోయినా రకరకాల పరీక్షలు చేసి బిల్లులు వేసి ఫీజులు దండుకుంటున్న ప్రైవేట్ హాస్పిటళ్లపై చర్య తీసుకోవాలని కోరారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మెడిక్యూర్ హాస్పిటల్‌కు కనీసం పార్కింగ్ కూడా లేకపోయినా ఆరోగ్యశ్రీ సేవలు మంజూరు చేయడం విచారకరమన్నారు. పరిగి సాధన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ హైవే పుట్‌పాత్‌పై ఉన్నదని, కనీసం పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో పాటు ప్రాణాలు పోతున్నా వైద్యాధికారులు పట్టించుకోకపోవడం లేదని మండిపడ్డారు. జిల్లాలో ఈ రకంగా ఫీజులు దండుకుంటున్న హాస్పిటళ్లపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, యాదయ్య, నర్సింహులు ఉన్నారు.

అరాచకాలు చేస్తే సహించం



చిలుకూరు బాలాజీ ఆలయంలో రంగరాజన్ పరామర్శిస్తున్న ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

మొయినాబాద్, ఫిబ్రవరి 11 : రామరాజ్యం పేరుతో అరాలచకాలు సృష్టిస్తే సహించేది లేదని... అర్చకులు రంగరాజన్‌పై దాడి చేసిన వారిని చట్టపరంగా శిక్షిస్తామని అసెంబ్లీ వ్యవహరాలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై జరిగిన దాడిని తెలుసుకున్న మంత్రి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు హనుమంతరావు, స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, తెలంగాణ అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేందర్ శర్మ, రాష్ట్ర కార్యదర్శి తనుగుల రత్నాకర్, యాదాద్రి ఆలయ రిటైర్డ్ అర్చకులు కారంపొడి నర్సింహాచార్యులు రంగరాజన్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. అలాగే ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ సౌందరరాజన్ యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దాడి ఎలా జరిగిందని దాడికి సంబంధించిన విషయాలను రంగరాజన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆలయం వద్ద మరింత భద్రతను పెంచి రక్షణ కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. దాడికి పాల్పడిన వారిలో ప్రధాన సూత్రదారుడితో పాటు మరి కొంద మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

రేపు లగచర్ల గ్రామ రైతులతో కలెక్టర్ సంప్రదింపులు

వికారాబాద్, ఫిబ్రవరి 11 : వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామ రైతులతో సంప్రదింపుల కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న వికారాబాద్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం సమావేశం హాలులో మధ్యాహ్నం 1.30 గంటలకు కార్యక్రమం జరుగుతుందన్నారు. లగచర్ల గ్రామ శివారులో గల సర్వే నం.102, 117, 120, 121లలో అసైన్డ్ భూమి సర్వే నంబర్ల రైతులతో ఎకరా భూమికి పరిహారం నిర్ణయించడం కోసం సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

అనంతగిరిలో చిరుత సంచారం



వికారాబాద్, ఫిబ్రవరి 11 : వికారాబాద్ అనంతగిరి అటవీ ప్రాంతంలో మంగళవారం చిరుత రోడ్డుపై సంచారం చేసింది. అటుగా వెళ్లే వాహనదారులు ఈ చిరుతను సెల్‌ఫోన్‌లో వీడియో తీశారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం రాత్రి ఈ వీడియోలు సోషల్ మీడియాతో చక్కర్లు కొడుతున్నాయి. రాత్రి సమయాల్లో అనంతగిరి అడవి గుండా వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

వికారాబాద్, ఫిబ్రవరి 11 : బీటెక్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు... వికారాబాద్ పట్టణంలోని గంగారం గ్రామానికి చెందిన శాలిని (18) హైదరాబాద్‌లోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నది. కొంతకాలంగా తీవ్ర తలనొప్పితో బాధ పడుతుండడంతో తల్లిదండ్రులు ఈ మధ్యనే ఇంటికి తీసుకొచ్చారు. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

ఎల్ ఐసీ ఉద్యోగుల నిరసన

బ్రాంచి మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్నఉద్యోగులు

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): భారతీయ బీమా సంస్థలో క్లాస్ త్రీ, ఫోర్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని హైదరాబాద్ డివిజన్‌లోని సర్కిల్-7 బ్రాంచ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు మంగళవారం భోజన విరామం సమయంలో నిరసన తెలిపారు. అంతకుముందు బ్రాంచ్ మేనేజర్ రవికుమార్‌కు వినతి పత్రం అందేశారు. ఉద్యోగాల భర్తీతో పాటు కార్మికుల హక్కులను కొనసాగించేందుకు ఏఐఐఈఏ సంఘానికి గుర్తింపునివ్వాలని కోరారు. యాజమాన్యం సానుకూలంగా స్పందించకుంటే 20న దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రమేశ్ గౌడ్, బాలకృష్ణ, రమణ, సత్యనారాయణ, చక్రధర్, సాల్మన్, శ్రీకాంత్, శ్రావ్య, సుచిత, జయ పాల్గొన్నారు.

పరీక్షలు ముగిశాక ఎన్నికలు నిర్వహించాలి

రాష్ట్ర ఎన్నికల సంఘం సంయుక్త కార్యదర్శి జయసింహారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, సంఘం నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 11 : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నా స్థానిక సంస్థలకు ఎన్నికలకు నిర్వహించకుండా జాప్యం చేసిందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. విద్యార్థులకు పరీక్షల సమయంలో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం హడావుడి చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల కార్యాలయంలో ఎన్నికల సంఘం సంయుక్త కార్యదర్శి జయసింహారెడ్డిని, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్‌తోపాటు పలువురు మాజీ సర్పంచ్‌లతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, మాజీ సర్పంచ్‌ల పలు సమస్యలను ఆయనకు వివరించినట్లు లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. పది, ఇంటర్ పరీక్షలకు ముందు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించవద్దని కోరినట్లు ఆయన తెలిపారు. పది, ఇంటర్ పరీక్షలు ముగిసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని అభ్యర్థించినట్లు ఆయన వివరించారు. అలాగే తాజా మాజీ సర్పంచ్‌లు ఐదేండ్ల పదవి కాలంలో గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. వీటికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో వారు ఆర్థికంగా కుదేలై, తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘం నాయకులు బాలరాజుముదిరాజ్, రామేశ్వర్‌రెడ్డి, ప్రకాశ్, రమేశ్, చంద్రశేఖర్, ప్రపుల్ తదితరులు ఉన్నారు.

దాడులు చేయడం హేయమైన చర్య

మొయినాబాద్, ఫిబ్రవరి 11 : రాముడి ముసుగులో అర్చకుడిపై దాడి చేయడం హేయమైన చర్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై ఐదు రోజుల క్రితం జరిగిన దాడి ఘటనను తెలుసుకుని మంగళవారం ఆలయానికి చేర